

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



గురువారం 05-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :138 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

నేడు తెలంగాణ కేబినెట్ భేటీ!



సాయంత్రం 4 గంటలకు మంత్రివర్గ సమావేశం

ముందుగా మంత్రులతో సీఎం అనధికారిక చర్చలు

కేబినెట్ అజెండాపై సీఎస్ ప్రత్యేక సమీక్ష

సంక్షేమ పథకాలు, కొత్త ప్రాజెక్టులపై చర్చ

ఖాళీల భర్తీ, ఉద్యోగ నియామకాలపై నిర్ణయాలు

పెట్టుబడులు, భూ కేటాయింపులకు ఆమోదంపై చర్చ

శాంతిభద్రతల పరిస్థితిపై సీఎం దిశానిర్దేశం

భేటీ తర్వాత నిర్ణయాలను వెల్లడించనున్న ప్రభుత్వం

కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ .. బీజేపీ చెప్పులు మోసే పార్టీ: కేటీఆర్

ఢిల్లీ నేతలపై కేటీఆర్ విమర్శలు

బండి సంజయ్‌పై సెటైర్లు

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని వ్యాఖ్య

తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చిందని ప్రశ్న

రేవంత్‌పై భూదందా ఆరోపణలు

ఏడాదిలో కేసీఆర్ రాక ఖాయమని వ్యాఖ్య

మియాపూర్ భూములపై కేటీఆర్ డిమాండ్



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): ఢిల్లీ పెద్దలు వస్తే బీజేపీ, కాంగ్రెస్ నేతల్లో భయం కనిపిస్తోందని, అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరిస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి అనే గుర్తింపు కూడా లేకుండా ఆయన్ను పక్కకు నెట్టేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఢిల్లీ నాయకుల ముందు తెలంగాణ నాయకులు వణుకుతున్నారని విమర్శించారు. అమిత్ షా ముందు బండి సంజయ్ బౌన్సర్ కంటే దారుణంగా తయారయ్యారని, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. నకంటే చిన్నవాడైన అమిత్ షా కాళ్లకు రాంచందర్ రావు నమస్కరించడం ఏంటి? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్ లో పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరారు.

అగ్నివీర్ సర్వీసు రెండేళ్లు పెంపు!

నాలుగేళ్ల నుంచి ఆరేళ్లకు సేవల పొడిగింపు

75 శాతం మందికి అదనపు సర్వీసు అవకాశం

స్వచ్ఛందంగా పొడిగింపు ఎంచుకునే వెసులుబాటు

అదనపు సర్వీసుకు మెరుగైన వేతనాలు

మెరిట్ ఆధారంగా శాశ్వత ఉద్యోగాలకు అవకాశం

25 శాతం మందికి రెగ్యులర్ నియామకాలు యథాతథం

ఆర్మీ అవసరాలు, యువత భవిష్యత్తే లక్ష్యం

2 లో

పోలవరం-బనకచర్లపై ద్వంద్వ వైఖరి!

రేవంత్‌పై కవిత తీవ్ర విమర్శలు

పోలవరం-బనకచర్లపై ద్వంద్వ వైఖరి

తెలంగాణ నీటి హక్కులకు ముప్పు

250 టీఎంసీల జలాలపై ఆరోపణలు

చంద్రబాబుకు రేవంత్ గురుదక్షిణ అంటూ వ్యాఖ్య

ప్రాజెక్టుకు సీఎం ఆమోదంపై విమర్శలు

ప్రధానికి లేఖ రాయాలని డిమాండ్



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరి మరోసారి బయటపడిందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఇసుమంతైనా అవగాహన గానీ, నిర్దిష్టమైన విధానం గానీ లేదని ఎన్ డబ్ల్యూడీఏ సమావేశాల సాక్షిగా తేటతెల్లమైందని ఆమె విమర్శించారు. ఎన్ డబ్ల్యూడీఏ సమావేశాల్లో అధికారులు పాల్గొని గోదావరి – కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) నుంచి చేపట్టాలని కోరుతుంటే, మరోవైపు కేంద్ర హోం శాఖ మంత్రి ఆధ్వర్యంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు.

2 లో

ఏడాదిలో బీజేపీ సర్కార్ పతనం: రాహుల్!

అమిత్ షా ప్రకటనపై ప్రతిపక్ష నేత విమర్శలు

సంగ్రూర్ ఇన్సాఫ్ ర్యాలీలో రాహుల్ కీలక వ్యాఖ్యలు

అదానీ పోర్టులో డ్రగ్స్ పట్టివేతపై ప్రశ్నలు

కేంద్రం తీసుకున్న చర్యలపై నిలదీత

గ్యాంగ్‌స్టర్లకు రక్షణ కల్పిస్తున్నారంటూ ఆరోపణలు

మణిపూర్ హింసపై కేంద్రాన్ని నిలదీసిన రాహుల్

మోదీ సర్కారుపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

అమిత్ షా హామీలపై రాహుల్ గట్టి కౌంటర్

2 లో

ఈడీ విచారణలో అంబటి వాంగ్మూలం!

లిక్కర్ ట్రాన్స్‌పోర్టు కేసులో కీలక పరిణామం

అంబటి రాంబాబును రెండు గంటల పాటు విచారించిన ఈడీ

మద్యం రవాణా కాంట్రాక్టులపై ప్రశ్నలు

అనుచరులకు సబ్‌కాంట్రాక్టుల కేటాయింపుపై ఆరా

ఆర్థిక లావాదేవీలు, నిధుల మళ్లింపుపై విచారణ

అంబటి చెప్పిన వివరాలను నమోదు చేసిన అధికారులు

మాజీ మంత్రి వాంగ్మూలాన్ని రికార్డు చేసిన ఈడీ

వాంగ్మూలం పరిశీలన తర్వాత తదుపరి చర్యలపై ఉత్కంఠ

2 లో

ప్రయాణికురాలితో గొడవ కండక్టర్ మృతి!



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) మృతి చెందారు. విధి నిర్వహణలో భాగంగా తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.

బంగాళాఖాతంలో మరో తుపాను!



నవంబర్ 15 తర్వాత తుపాను ముప్పు

బంగాళాఖాతంలో బలపడనున్న ఉపరితల ఆవర్తనం

ఏపీ, తమిళనాడుపై తుపాను ప్రభావం

నెల్లూరు, తిరుపతి, చిత్తూరుకు భారీ వర్ష సూచన

కోస్తాంధ్ర, రాయలసీమకు వర్షాల ముప్పు

తుపాను దిశ, తీవ్రతపై త్వరలో స్పష్టత

తీర ప్రాంత ప్రజలకు అప్రమత్తత సూచన

మత్స్యకారులు ఐఎండీ హెచ్చరికలు గమనించాలని సూచన

2 లో

కాంగ్రెస్‌కు సీపీఐ అండ టీజేఎస్ సంగతేంటి?



- రెండు ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ ఫోకస్
- సీపీఐ, టీజేఎస్ మద్దతు కోరిన సీఎం
- కాంగ్రెస్‌కు మద్దతుగా సీపీఐ నిర్ణయం
- టీజేఎస్ నిర్ణయంపై కొనసాగుతున్న ఉత్కంఠ
- నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ హామీ
- ఆరుతడి పంటలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- భూమిలేని రైతులకూ బీమా పథకం
- విద్యార్థి సంఘాల ఎన్నికలకు సీఎం సానుకూలం
- కరువు, రైతు సమస్యలపై నేతల వినతి

న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ రాజకీయ సమీకరణాలపై దృష్టి సారించింది. ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తమ మిత్రపక్షాలైన సీపీఐ, తెలంగాణ జన సమితి (టీజేఎస్) నాయకత్వాలను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో రెండు పార్టీల నేతలతో సీఎం రేవంత్ రెడ్డి వేర్వేరుగా సమావేశమై ఇదే అంశంపై చర్చించారు.

హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సామ రామ్మోహన్‌రెడ్డి.. నల్గొండ–ఖమ్మం–వరంగల్ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో ఉన్నారు.

మిగతాది 2 లో..

కాంగ్రెస్‌లో మళ్లీ రచ్చ!

కాంగ్రెస్‌లో నేతల మధ్య విభేదాల కలకలం

దామోదర-లక్ష్మీకాంతారావు వివాదంపై పీసీసీ సీరియస్

ఇద్దరు నేతలకు గాంధీభవన్‌కు పిలుపు

విడివిడిగా వివరణ తీసుకోనున్న పార్టీ పెద్దలు

ఢిల్లీలో హోటల్ లాబీలో వాగ్వాదం?

వ్యక్తిగత దూషణలు, బెదిరింపులంటూ ఎమ్మెల్యే ఆరోపణలు

నామినేటెడ్ పదవుల వ్యవహారమే వివాదానికి కారణమా?

ఇతర నియోజకవర్గాల్లోనూ క్రమశిక్షణ ఉల్లంఘనలపై దృష్టి

పార్టీ ప్రతిష్ఠ దెబ్బతినకుండా హైకమాండ్ చర్యలు?



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): అధికార కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య నెలకొంటున్న విభేదాలు ఇప్పుడు పార్టీ నాయకత్వానికి కొత్త తలనొప్పిగా మారుతున్నాయి. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యనేతల వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమవుతుండగా.. తాజాగా మంత్రి దామోదర రాజనర్సింహా, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మధ్య చోటుచేసుకున్నట్లు ప్రచారం జరుగుతున్న ఎపిసోడ్ పార్టీలో కలకలం రేపుతోంది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ.. నష్టనివారణ చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

2 లో

ఏపీలో నేడు పంచాయతీ పోరు!

నేడు యథావిధిగా ఎన్నికలు

పోలింగ్ ఏర్పాట్లపై ఎస్ఈసీ సమీక్ష

31,460 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

2.61 కోట్ల మంది ఓటర్లు

2.52 లక్షల మంది సిబ్బంది

2,051 స్థానాలు ఏకగ్రీవం

ఎన్నికల బరిలో 18,843 మంది



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మురసు తుఫాన్ ప్రభావం, భారీ వర్షాల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా నేడు ఎన్నికలు యథావిధిగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కీలక వివరాలు వెల్లడించారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 05-11-2026

అగ్నివీర్ సర్వీసు రెండేళ్లు పెంపు!



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): భారత సాయుధ బలగాల్లో నియామకాల కోసం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకంలో కేంద్ర ప్రభుత్వం కీలక సవరణలు చేసింది. అగ్నివీరుల సేవ కాలపరిమితిని పెంచుతూ రక్షణ శాఖ, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ కీలక ప్రకటన విడుదల చేశారు. వాస్తవానికి నిబంధనల ప్రకారం అగ్నివీరుల కాలపరిమితి 4 ఏళ్లు మాత్రమే ఉండగా, నూతన నిర్ణయం ప్రకారం 4 ఏళ్ల సేవలు పూర్తిచేసుకున్న వారిలో 75 శాతం మందికి అదనంగా మరో 2 సంవత్సరాల పాటు సేవలను పొడిగించనున్నారు. దీంతో వారి మొత్తం సర్వీసు కాలం 6 ఏళ్లకు చేరుతుంది. ఈ అదనపు రెండేళ్ల సర్వీసును ఎంచుకోవడం పూర్తిగా అభ్యర్థుల స్వచ్ఛంద నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది.

మెరుగైన వేతనాలు, శాశ్వత నియామకానికి చాన్స్..

అదనంగా 2 ఏళ్ల సర్వీసు అందించే అగ్నివీరులకు మరింత మెరుగైన జీతభత్యాలు అందజేయనున్నట్లుగా అధికారులు తెలిపారు. అంతేకాకుండా, ఈ ఆరేళ్ల కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న అగ్నివీరుల పనితీరును అంచనా వేసి, మెరిట్ ఆధారంగా సాయుధ బలగాల్లో శాశ్వత ప్రాతిపదికన నియమించే అవకాశాన్ని కూడా కల్పించనున్నారు. కాగా, ప్రతి బ్యాచ్ నుంచి 25 శాతం మందిని 4 ఏళ్ల వ్యవధి ముగియగానే నేరుగా రెగ్యులర్ బలగాల్లోకి తీసుకునే ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అగ్నిపథ్ పథకంపై వచ్చిన ఫీడ్‌బ్యాక్, ఆర్మీ అవసరాలు, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా కేంద్ర రక్షణ శాఖ తెలిపింది.

కాంగ్రెస్‌లో మళ్లీ రచ్చ!

మొదటి పేజీ తరువాయి

ఇందులో భాగంగా గాంధీ భవన్ కు రావాల్సిందిగా మంత్రి దామోదర రాజ నర్సింహా, ఎమ్మెల్యే లక్ష్మీ కాంత రావ్‌కు సూచించిన పీసీసీ..ఆ తర్వాత మిగతా నియోజక వర్గాల్లో ఇటీవల జరిగిన క్రమశిక్షణ రాహిత్యంపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది.



టీపీసీసీ సీరియస్.. గాంధీభవన్‌కు పిలుపు:

దామోదర వర్సెస్ లక్ష్మీ కాతారావుల మధ్య గొడవ అంశంపై నేషనల్ మీడియాలోనూ కథనాలు వెలువడ్డాయి. దీంతో ఈ రచ్చ జాతీయ స్థాయిలో పార్టీ పరువు బజారున పడేలా చేసిందని దీంతో ఈ ఇద్దరు నేతల తీరుపై పీసీసీ సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే మంత్రి దామోదర రాజనర్సింహా, ఎమ్మెల్యే కాంతారావులను వెంటనే గాంధీభవన్‌కు రావాల్సిందిగా ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇద్దరు నేతలతో విడివిడిగా, అవసరమైతే కలిపి మాట్లాడి అసలు వివాదానికి మూలమేంటో ఆరా తీయనున్నట్లు సమాచారం. అయితే ఢిల్లీ వేదికగా కీచులాడుకోవడానికి ఈ ఇద్దరి నేతల మధ్య ఉన్న విభేదాలేంటో పీసీసీ పెద్దల సమక్షంలో వీరు ఎలాంటి సంజాయిషీ ఇవ్వబోతున్నారు అనేది రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

ఢిల్లీలో అసలేం జరిగింది?

ఎస్ఐఆర్, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి వెళ్లారు. ఈ క్రమంలో ఢిల్లీలోని షాంగ్రిలా హోటల్ లాబీలో మంత్రి దామోదర రాజనర్సింహ తనపై వ్యక్తిగత దూషణలకు దిగారని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆరోపించినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మంత్రి తనపై గట్టిగా కేకలు వేస్తూ దుర్భాషలాడారని కూడా ఆయన ఆరోపించినట్లు ప్రచారం జరిగింది. నామినేటెడ్ పదవులు, పార్టీ వ్యవహారాలు, నియోజకవర్గ స్థాయి పనులకు సంబంధించి తలెత్తిన విభేదాలే ఈ వాగ్వాదానికి కారణమనే చర్చ జరుగుతోంది.

క్రమశిక్షణలోకి వచ్చేనా?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువైన నాటి నుంచి ఏదో ఒక నియోజకవర్గంలో అసమ్మతి గళం వినిపిస్తూనే ఉంది. ఇప్పటికే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నిధుల కేటాయింపులపై బహిరంగంగానే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా వ్యాఖ్యలు చేయగా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సైతం నిధుల విడుదలపై హాట్ కామెంట్స్ చేశారు. ఇప్పుడు ఏకంగా కేబినెట్ మంత్రితోనే ఓ ఎమ్మెల్యే ఢిల్లీ దాకా వెళ్లి గొడవపడడం పార్టీ ఇమేజ్‌ను తీవ్రంగా దెబ్బతీస్తోందని హైకమాండ్ భావిస్తున్నట్లు సమాచారం. మరి పీసీసీ ప్రయత్నాలతోనైనా అధికార పార్టీలో నేతలు సెట్ రైట్ అవుతారా లేదా అనేది వేచి చూడాలి.

ఈడీ విచారణలో అంబటి వాంగ్మూలం!



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): మద్యం రవాణా కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. హైదరాబాద్ ఈడీ కార్యాలయంలో ఆయనను అధికారులు రెండు గంటల పాటు ప్రశ్నించారు. ప్రధానంగా మద్యం రవాణా కాంట్రాక్టులు, వాటి కేటాయింపులపై ఈడీ ప్రశ్నించింది. అంబటి రాంబాబు అనుచరులకు, ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తులకు సబ్‌కాంట్రాక్ట్‌లు ఎలా లభించాయనే కోణంలోనూ ప్రశ్నలు సంధించారు. కాంట్రాక్టుల కేటాయింపుల వెనుక ఉన్న నిబంధనలు, అందులో జరిగిన ఆర్థిక లావాదేవీలు, నిధుల మళ్లింపు ఏమైనా జరిగిందా అన్న విషయాలపైనా అధికారులు వివరాలు సేకరించారు.

అంబటి చెప్పిన అంశాలన్నీ రికార్డు చేసిన ఈడీ

మరోవైపు విచారణలో అంబటి రాంబాబు చెప్పిన విషయాలను అధికారులు రికార్డు చేశారు. అంతేకాకుండా అంబటి వాంగ్మూలాన్నీ నమోదు చేశారు. విచారణ ముగిసిన అనంతరం అంబటి రాంబాబు ఈడీ కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. అయితే అంబటి వాంగ్మూలాన్ని పరిశీలించిన తర్వాత పరిణామాలు చోటు చేసుకుంటాయనే చర్చ మొదలైంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

ఏడాదిలో బీజేపీ సర్కార్ పతనం: రాహుల్!



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): మూడేళ్లలో మాదకద్రవ్యాలను నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో ఆయన ప్రసంగిస్తూ.. "మూడేళ్ల గడువు గురించి అమిత్ షా మాట్లాడుతున్నారు, కానీ నా అంచనా ప్రకారం ఏడాది లోపే ఈ కేంద్ర ప్రభుత్వం కూలిపోతుంది. అప్పటికి ఆయన హోంమంత్రిగా కూడా ఉండకపోవచ్చు" అని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని అదానీ పోర్టులో వేల కిలోల హెరాయిన్, డ్రగ్స్ పట్టుబడిన ఘటనలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకుందో దేశ ప్రజలకు చెప్పాలని రాహుల్ సూటిగా ప్రశ్నించారు.

దేశంలో శాంతిభద్రతల గురించి మాట్లాడే నైతిక హక్కు కేంద్ర హోంమంత్రికి లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. జైళ్లలోనే గ్యాంగ్‌స్టర్లకు రక్షణ కల్పిస్తూ వారికి కొమ్ముకాస్తున్నారని, ఈ విషయం దేశం మొత్తానికి తెలుసని ఆరోపించారు. మాదకద్రవ్యాల నివారణ, చట్టం గురించి మాట్లాడే ముందు మణిపూర్‌లో జరుగుతున్న హింస, శాంతిభద్రతల వైఫల్యంపై సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

బంగాళాఖాతంలో మరో తుపాను!



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): బంగాళాఖాతంలో నవంబర్ 15 తర్వాత మరొక ఉపరితల ఆవర్తనం తీవ్రమై తుపానుగా మారే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఉండే ఉత్తర, తూర్పు రుతుపవనాల కాలంలో సాగరంలో వరుసగా తుపాన్లు ఏర్పడటానికి అనుకూలమైన పరిస్థితులు ఉంటాయి. ఈ తుపాను తీవ్రతను బట్టి ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరుతో పాటు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోనూ, పొరుగున ఉన్న తమిళనాడు ఉత్తర తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రస్తుతం తుపాను సూచనలు ఉన్నప్పటికీ, ఇది ద్రోణి రూపంలో స్థిరపడి తుపానుగా మారే ఖచ్చితమైన మార్గం, తీవ్రత, ల్యాండ్‌ఫాల్ వివరాలపై మరో మూడు, నాలుగు రోజుల్లో మరింత స్పష్టత రానుంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో వరుసగా వాతావరణ మార్పులు చోటుచేసుకునే ముప్పు ఉన్నందున తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఎప్పటికప్పుడు ఐఎమ్‌డీ విడుదల చేసే తాజా వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

నేడు తెలంగాణ కేబినెట్ భేటీ!

న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నేడు సాయంత్రం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ అధికారిక భేటీ సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానుండగా, దానికి ముందుగా మధ్యాహ్నం 3 గంటల సమయంలో మంత్రులతో సీఎం అనధికారికంగా సమావేశమై పలు అంశాలపై చర్చించనున్నారు. కేబినెట్ భేటీ వేళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన ప్రధాన అజెండా ప్రతులు, చర్చించాల్సిన ముఖ్యాంశాలు, ప్రతిపాదిత బిల్లులను పరిశీలించి, కేబినెట్ ముందుకు తీసుకురావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను సీఎస్ పూర్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాల పురోగతి, కొత్త ప్రాజెక్టులు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగ నియామకాలు, బడ్జెట్ కేటాయింపులపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. వీటితో పాటు రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక ప్రాజెక్టులకు భూ కేటాయింపులకు ఆమోదం తెలపడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు దిశానిర్దేశం చేయనున్నారు. సాయంత్రం కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం, మంత్రివర్గం తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలను ప్రభుత్వం అధికారికంగా మీడియాకు వెల్లడించనుంది.

ఏపీలో నేడు పంచాయతీ పోరు!

మొదటి పేజీ తరువాయి

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలు, స్థానిక పరిస్థితులు, మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. తుఫాన్ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో పోలింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కలెక్టర్లు సమర్పించే నివేదికల ఆధారంగా అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం మొత్తం 31,460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఈసీ వెల్లడించింది. ఈ ఎన్నికల్లో సుమారు 2.61 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల విధుల కోసం దాదాపు 2.52 లక్షల మంది సిబ్బందిని నియమించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం సుమారు 52 వేల మంది సిబ్బందిని సిద్ధం చేశారు. ఇక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సీసీటీవీ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,821 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. వాటిలో 2,051 స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 7,770 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు కలిపి మొత్తం 18,843 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. భారీ వర్షాలు, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోనూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటూ పోలింగ్‌ను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

పోలవరం-బనకచర్లపై ద్వంద్వ వైఖరి!

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ నీటి హక్కులకు విఘాతం:

పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని 2024లోనే తెలంగాణ జాగృతి తరపున మొదటగా స్పందించి, ఏపీ చేపడుతున్న ఈ అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేశామని ఆమె గుర్తుచేశారు. రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి నిర్వహించిన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలోనూ రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు ఓకే చెప్పి, బయటకు వచ్చి మీడియా ముందు అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. సీఎం రేవంత్ ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం నదుల అనుసంధానంలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తోందన్నారు.

ప్రధానికి లేఖ రాయాలి:

ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పోలవరం – బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు వాటిల్లే ప్రమాదాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని రకాల సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని డిమాండ్ చేశారు.

ప్రయాణికురాలితో గొడవ.. కండక్టర్ మృతి!

మొదటి పేజీ తరువాయి



కొద్ది రోజుల క్రితం బస్సులో ప్రయాణికురాలితో టికెట్ విషయంలో వివాదం జరిగింది. ఈ సమయంలో ఓ ప్రయాణికులు కండక్టర్ ప్రవళికను తోసేసింది. ప్రమాదవశాత్తు ప్రవళిక కాలుజారి బస్సు టైర్ల కింద పడిపోయింది. దీంతో ఆమె కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం మెరుగుపడుతుందని అంతా భావించారు.

కానీ వైద్యుల ప్రయత్నాలు ఫలించకపోవడంతో నిన్న రాత్రి తుదిశ్వాస విడిచారు. ప్రయాణికురాలి నిర్వాకంతో చిన్న వయసులోనే ప్రవళిక చెందడంతో మణుగూరు డిపోతో పాటు ఆర్టీసీ ఉద్యోగులందరిలోనూ శోకసంద్రం అలుముకుంది. ఈ సంఘటనపై స్పందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ తరపున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు, ఆమె తల్లికి ఉద్యోగం, కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రవళిక కుటుంబాన్ని సంపూర్ణంగా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌కు సీపీఐ అండ.. టీజేఎస్ సంగతేంటి?

మొదటి పేజీ తరువాయి

ఈ రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని రేవంత్ రెడ్డి ఆయా పార్టీల నాయకులను కోరారు. మొదట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది. అనంతరం టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలోని నాయకులు సీఎంను కలిశారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై ఇరు పార్టీల నాయకత్వాలు సానుకూలంగా స్పందించాయి. అయితే పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించిన తర్వాత అధికారిక నిర్ణయం వెల్లడిస్తామని తొలుత తెలిపాయి.

తాజాగా సీపీఐ తన నిర్ణయాన్ని ప్రకటించింది. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. సీపీఐతో పాటు పార్టీ అనుబంధ ప్రజా సంఘాలు కూడా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తాయని స్పష్టం చేశారు. తాము ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్నామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. టీజేఎస్ మాత్రం మద్దతుపై తన పార్టీ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

ముఖ్యమంత్రితో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు పలు ప్రజా సమస్యలు కూడా చర్చకు వచ్చాయి. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఎదుర్కొనే సవాళ్లు, రైతులకు ప్రోత్సాహకాలు, నిరుద్యోగ సమస్య, ఉద్యోగ నియామకాలు, గిరిజనుల సంక్షేమం, రైతు బీమా, రైల్వే ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నేతలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని కోదండరాం కోరారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలపై స్పష్టత ఇచ్చేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోదండరాం సూచించారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. కరువు పరిస్థితులపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్‌కమిటీకి ఆరుతడి పంటల ప్రోత్సాహకాలతో పాటు ఇతర సూచనలు అందించాలని కోరారు. ఉద్యోగ ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్లు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో భూమిలేని రైతులకు కూడా బీమా ప్రయోజనం కల్పించేలా కొత్త పథకాన్ని రూపొందిస్తున్నట్లు రేవంత్ రెడ్డి సమావేశంలో వెల్లడించినట్లు తెలిసింది.

మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించిన సీఎం రేవంత్ రెడ్డి.. ధాన్యం కొనుగోళ్ల కోసం బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు దాదాపు రూ.లక్ష కోట్లకు చేరినట్లు పేర్కొన్నారని సమాచారం. సీఎంతో జరిగిన భేటీలో విద్యార్థి సంఘాల ఎన్నికల అంశాన్ని కూడా కూనంనేని ప్రస్తావించారు. కాలేజీలు, యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ ఎన్నికలు ఉపయోగపడతాయని వివరించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు.

అలాగే పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడం వంటి అంశాలను కూడా కూనంనేని రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అగ్రిగోల్డ్ ఆస్తులను విక్రయించి బాధితులకు పరిహారం అందించే అంశాన్ని పరిశీలించాలని సూచించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 12.5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని.. రైతులకు పంట బీమా కూడా అందుబాటులో లేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.25 వేల కోట్ల సహాయం కోరినా అది సరిపోదని అభిప్రాయపడ్డారు. పంటలు సాగు చేయలేని రైతులకు కూడా కరువు భత్యం అందించాలని డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించే అంశంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని కోరారు.

కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ .. బీజేపీ చెప్పులు మోసే పార్టీ: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. ఢిల్లీ పార్టీల వల్ల తెలంగాణకు న్యాయం జరగదు.. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటేనని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలను మరోసారి నమ్మితే తెలంగాణను ఢిల్లీకి లేదా గుజరాత్‌కు అమ్మేస్తారన్నారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే, బీజేపీ చెప్పులు మోసే పార్టీ అని ఘాటు విమర్శలు చేశారు.

అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లు..

అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారు. రాష్ట్రానికి ఏం ఇచ్చారని ప్రశ్నించారు. తెలంగాణకు ఒక్క మెట్రో ప్రాజెక్టు ఇచ్చారా? ఒక్క జాతీయ ప్రాజెక్టు ఇచ్చారా? ఒక్క విద్యాసంస్థ ఇచ్చారా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళ్తూ ఆయనో ఈఎంఐ ముఖ్యమంత్రిగా మారిపోయారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు, రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయం అన్నారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేస్తే ఎలా ఉంటదో.. భూములు అమ్మే బ్రోకర్ రేవంత్ రెడ్డిని సీఎం చేస్తే అలానే ఉందన్నారు. మియాపూర్ భూములను అనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కబ్జా పెడితే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రముఖ న్యాయవాదిని పెట్టి కేసు వాదించిందన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ఆ భూమి ప్రభుత్వానిది అని తీర్పు ఇస్తే తీర్పు వచ్చిన వెంటనే రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి ఆ భూములు అమ్మేస్తున్నా అని చెప్తున్నాడని విమర్శించారు.

సంవత్సరం లోపల కేసీఆర్ రాబోతున్నాడు

మరో సంవత్సరం లోపల కేసీఆర్ రాబోతున్నారని రేవంత్ రెడ్డి వేసే ఎంగిలి మెతుకులకు ఎవరైనా పారిశ్రామికవేత్తలు ఆశపడి హిల్ట్ పీ లో భూములు కొంటే తిరిగి అనుభవిస్తారని హెచ్చరించారు. మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఇప్పుడు జరుగుతున్న భూదందాలన్నింటికీ చెక్ పెడతామన్నారు. మియాపూర్‌లో 550 ఎకరాల భూములు వస్తే అమ్మేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నాడు. ఆ భూముల్లో 200 ఎకరాలు పేదలకు ఇండ్లు, 100 ఎకరాల్లో అమరవీరులకు, ఇంకో 100 ఎకరాలు ఉద్యమకారులకు, మిగతాది పిల్లలకు స్కూల్స్, కాలేజీలు కట్టిస్తే మేము గొప్పగా స్వాగతిస్తామన్నారు.

ఈసీ చట్టంలోని 'సెక్షన్-16'పై సవాలు.. కేంద్రాన్ని వివరణ కోరిన సుప్రీంకోర్టు



న్యూస్ డెస్క్, 05 నవంబర్ (ఇది కద నిజం): ముఖ్య ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల కి వారి అధికారిక విధుల నిర్వహణలో తీసుకునే నిర్ణయాలు, చేసిన పనులపై సివిల్, క్రిమినల్ విచారణల నుంచి జీవితకాల రక్షణ కల్పించే చట్టపరమైన నిబంధనపై భారత సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. ముఖ్య ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం – 2023లోని సెక్షన్ 16 రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను స్వీకరించిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం దీనిపై స్పందించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంతో పాటు భారత ఎన్నికల సంఘానికి కూడా నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

అయితే, 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త చట్టంలోని సెక్షన్ 16 ప్రకారం బాధ్యతల్లో ఉన్న, పదవీ విరమణ పొందిన సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్లు తమ అధికారిక విధుల నిర్వహణలో చేసిన ఏ చర్యపైనా ఎలాంటి సివిల్, క్రిమినల్ న్యాయస్థానాల్లో విచారణ జరపడానికి వీల్లేదు. ఈ క్రమంలోనే రాజ్యాంగంలోని ఆర్ట

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 05-11-2026

పట్టభద్రులు ప్రశ్నించే హక్కును కోల్పోవద్దు

తెలంగాణ రక్షణ సేన పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ భవాని వేముల

ఇది కద నిజం,హైదరాబాద్, నవంబర్ 2:

తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత, పార్టీ ఆవిర్భావానికి ముందునుంచే బీసీ బిడ్డల హక్కుల కోసం, బహుజన పాలన సాధన కోసం పోరాటం చేస్తున్నారని మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ భవాని వేముల పేర్కొన్నారు.

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాష్ కొల్లూరును తెలంగాణ రక్షణ సేన ప్రకటించడం బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో భాగమని తెలిపారు.

విద్యావంతుడైన ఆకాష్ కొల్లూరు నేషనల్ ఛానల్ జర్నలిస్టుగా పనిచేసి, ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకున్నారని, సామాజిక బాధ్యతతో ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి ప్రవేశించారని పేర్కొన్నారు. గతంలో అనేక పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ కుమ్మరి సామాజికవర్గానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదని అన్నారు.



బీసీ సామాజికవర్గానికి చెందిన కుమ్మరి బిడ్డకు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం ద్వారా కల్వకుంట్ల కవిత బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తామన్న మాటను నిలబెట్టుకున్నారని భవాని వేముల తెలిపారు.

పట్టభద్రులు ఆలోచించి, ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం ఉన్న అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని, అర్హులైన ప్రతి పట్టభద్ర ఓటరు ఆకాష్ కొల్లూరుకు ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు & ఎమ్మెల్సీ ఇంచార్జి డా. రఘు టీఆరెఎస్ కుటుంబ సభ్యులు మరియు మహిళలు పాల్గొన్నారు.

మడిశెట్టి యాదయ్య పరామర్శించిన గొంగిడి సునీత మహేందర్ రెడ్డి



ఇది కద నిజం : రాజాపేట మండల కేంద్రానికి చెందిన మడిశెట్టి యాదయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం హైదరాబాద్‌లోని పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా యాదయ్య ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని వారికి మనోధైర్యం కల్పించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో స్వయంగా మాట్లాడి యాదయ్య ప్రస్తుత వైద్య పరిస్థితిని ఆరా తీశారు. ఆయనకు ప్రాణాపాయం లేకుండానూ, మెరుగైన వైద్యం అందేలా చూసి త్వరగా కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులను ఆమె కోరారు.

మొగులగని వెంకన్నను పరామర్శించిన గొంగిడి సునీత



ఇది కద నిజం:ఆలేరు మండలం శర్బణపురం గ్రామానికి చెందిన ప్యాక్స్ గ్రూజూ) మాజీ చైర్మన్ మొగులగని మల్లేష్ సోదరుడు మొగులగని వెంకన్న బ్రెయిన్ సంబంధిత సమస్యతో బాధపడుతూ హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్, నియోజకవర్గ ఇన్-చార్జ్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి వెంకన్నను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం అక్కడి వైద్యులతో స్వయంగా మాట్లాడి, వెంకన్న ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయనకు తగిన శ్రద్ధ తీసుకుంటూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

TRS పార్టీలో చేరిన BRS నాయకుడు బుప్పి శివకుమార్



ఇది కద నిజం:రాజేంద్రనగర్ నియోజకవర్గం హైదర్ షాకోట్ 123 డివిజన్‌కు చెందిన BRS పార్టీ నాయకుడు బుప్పి శివకుమార్, తెలంగాణ రక్షణ సేన పార్టీ రాజేంద్రనగర్ ఇంచార్జ్ నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో TRS పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాళీ మందిర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ నీరుడు సర్వేష్ ముదిరాజ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ రోజురోజుకూ బలోపేతం అవుతోందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పార్టీ ముందుకు సాగుతోందని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత విస్తరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

యాదవుల ఆత్మగౌరవం, ఐక్యతకు ప్రతీక సదర్ ఉత్సవాలు

నల్లాల వినయ్ కుమార్



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహిస్తున్న సదర్ ఉత్సవాల సందర్భంగా యాదవ సోదర సోదరీమణులకు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్ హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పశు సంపద వైభవానికి సదర్ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. యాదవుల సంప్రదాయాలు, ఆత్మగౌరవం, ఐక్యతను చాటిచెప్పే ఈ వేడుకలు ప్రత్యేక గుర్తింపు కలిగి ఉన్నాయని అన్నారు.

సదర్ ఉత్సవాల్లో ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతుల ప్రదర్శనలు, వాటి ఠీవి, దర్పం, సందడి ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటాయని తెలిపారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాలు భావితరాలకు సైతం అందించాల్సిన అవసరం ఉందన్నారు. యాదవ సోదరుల ఐక్యత, అభివృద్ధి మరింత బలోపేతం కావాలని, సదర్ పండుగ ప్రతి యాదవ కుటుంబంలో సంతోషాలు, సిరిసంపదలు నింపాలని నల్లాల వినయ్ కుమార్ ఆకాంక్షించారు.

ముళుగు విద్యా విజయాల పరంపర కొనసాగాలి..

మరోసారి రాష్ట్రంలో ప్రథమ స్థానమే లక్ష్యం -- మంత్రి సీతక్క

- విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులే.. వారిలో ఆత్మవిశ్వాసం నింపాలి
- మారుమూల గిరిజన విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టాలి.. పోటీ ప్రపంచానికి దీటుగా తీర్చిదిద్దాలి
- చదువుతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం, భావవ్యక్తీకరణ నైపుణ్యాలపై దృష్టి సారించాలి
- విద్యా ఫలితాల్లో ముళుగు మరోసారి ప్రభంజనం సృష్టించాలి.. ఉపాధ్యాయులకు మంత్రి సీతక్క పిలుపు

ఇది కద నిజం ములుగు, నవంబర్ 04:





విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయులే నిత్య స్ఫూర్తిగా నిలుస్తారని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, పోటీ ప్రపంచంలో రాణించేలా నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో పదో తరగతి వార్షిక పరీక్షలు--2027 విద్యార్థుల సంసిద్ధతపై ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారుల సమష్టి కృషితో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ములుగు జిల్లా ఉత్తమ స్థానాలు సాధించడం అభినందనీయమన్నారు. గిరిజన ప్రాంత విద్యార్థులు సైతం ప్రతిభలో ఎవరికీ తీసిపోరని రాష్ట్రానికి చాటిచెప్పిన ఉపాధ్యాయుల సేవలను ప్రశంసించారు. రాబోయే పరీక్షల్లోనూ వంద శాతం ఉత్తీర్ణతతో పాటు రాష్ట్రంలో ములుగు జిల్లాను మరోసారి అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చదువుతోపాటు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించాలని, కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని, ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాల విద్యార్థుల్లో బిడియాన్ని తొలగించి ఆత్మవిశ్వాసం నింపాలని కోరారు. కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ.. ములుగు జిల్లా విద్యా ఫలితాల్లో సాధిస్తున్న వరుస విజయాలు ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనమని, ఇదే స్ఫూర్తితో పనిచేసి మరోసారి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తి చేసి, విద్యార్థుల అభ్యసన స్థాయిని బట్టి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మంగపేట నూతన ఎస్‌హెచ్‌ఓ మధుకర్‌కు కాంగ్రెస్ నాయకుల ఘన స్వాగతం.. శుభాకాంక్షలు

- ప్రజలు--పోలీసుల మధ్య సత్సంబంధాలు బలోపేతం కావాలి -- నూతన ఎస్‌హెచ్‌ఓకు కాంగ్రెస్ నాయకుల అభినందనలు
- ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి
- మండల కాంగ్రెస్ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు

ఇది కద నిజం మంగపేట, నవంబర్ 04:

మంగపేట పోలీస్‌స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన మధుకర్‌ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌హెచ్‌ఓకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చెట్టుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మంగపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, అన్ని వర్గాల ప్రజలకు సమానంగా పోలీసు సేవలు అందించాలని కోరారు. ప్రజల సమస్యలను సానుకూలంగా ఆలకిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు ప్రజలు, పోలీసుల మధ్య పరస్పర విశ్వాసం, సత్సంబంధాలు బలోపేతం కావాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో మధుకర్ విజయవంతంగా ముందుకు సాగాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చింతా పున్నారావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య, జిల్లా న్యాయ విభాగం చైర్మన్ బండ జగన్మోహన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు మైల జయరాం రెడ్డి, సామాజిక మాధ్యమాల రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగేంద్రబాబు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యురాలు పాయం అనిత, సహకార సంఘం అధ్యక్షులు తోట రమేష్, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక కమిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్, మండల కార్యనిర్వాహక అధ్యక్షులు కొంకతి సాంబశివరావు, మాజీ జడ్పీటీసీ సిద్ధంశెట్టి వైకుంఠం, సహకార సంఘం డైరెక్టర్ కొడం బాలకృష్ణ, జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, కారుపోతుల నర్సయ్య, దామెర సారయ్య, ఏటూరునాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ మండవ రామకృష్ణ, మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాస్ రావు, శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ యర్రంగారి సురేష్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యంపెల్లి వీరస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు మైప లాలయ్య, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు హిదయతుల్లా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





గ్రామ పంచాయతీల లెక్కలపై ఆడిటింగ్ అధికారుల తనిఖీలు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :కామారెడ్డి జిల్లా పిట్లం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఆడిటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆడిటింగ్ అధికారులు గ్రామ పంచాయతీల ఆదాయ, వ్యయ వివరాలు, ప్రభుత్వ నిధుల వినియోగం, అభివృద్ధి పనులకు సంబంధించిన ఖర్చులు, బిల్లులు, వోచర్లు, నగదు పుస్తకాలు, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ నిధులు నిబంధనల ప్రకారం వినియోగించారా లేదా అనే అంశాలను తనిఖీ చేస్తూ, లెక్కల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చర్యలు చేపడుతున్నారు. రికార్డుల్లో ఏవైనా లోపాలు లేదా వ్యత్యాసాలు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సూచనలు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల వారీగా ఆడిటింగ్ ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంటోంది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 05-11-2026



సెన్సార్ అభ్యంతరంతో టైటిల్ మార్పు

'లిటిల్ హార్ట్స్' చిత్రంతో సెన్సేషనల్ సక్సెస్ అందుకున్న యూట్యూబ్ సెన్సేషన్, యంగ్ హీరో మౌళి.. ఇప్పుడు ఓ ఇంట్రెస్టింగ్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే ఈ సినిమాకు 'దొంగ నా కొడుకు' అనే టైటిల్‌ను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 13న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలయ్యేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా టైటిల్‌పై సెన్సార్ బోర్డు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు.

ఫుల్ టైటిల్‌కి బదులుగా దాని షార్ట్ ఫార్మ్ అయిన 'DNK' పేరుతోనే ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్‌కి ఆడియన్స్ నుంచి సాలిడ్ రెస్పాన్స్ రాగా.. ప్రమోషన్స్ హోరెత్తిస్తున్న చిత్రబృందం త్వరలోనే ట్రైలర్‌ను కూడా లాంచ్ చేయడానికి ప్లాన్ చేస్తోంది. కాగా.. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. శ్రీను కంబాల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మౌళి సరసన సుమ్రిత శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. సింజిత్ యెర్రమిల్లి సంగీతాన్ని అందిస్తున్నారు.



'హత:' విడుదల వాయిదా

టాలీవుడ్ టాలెంటెడ్ హీరో కమ్ ప్రొడ్యూసర్ కిరణ్ అబ్బవరం సమర్పణలో రాబోతున్న హారర్ థ్రిల్లర్ 'హత:'. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం అనూహ్యంగా విడుదల వాయిదా పడినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ముందుగా ఈ సినిమాను నవంబర్ 6న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించినప్పటికీ.. అనుకున్న సమయానికి రావడం లేదంటూ మూవీ టీమ్ ఒక కీలక నోట్‌ను విడుదల చేశారు. 'హత: కొత్త తేదీతో మరింత మెరుగైన అనుభవాన్ని అందించబోతున్నాం.

ప్రస్తుతం అనేక చిత్రాలు ఒకే సమయంలో విడుదలవుతుండటం వల్ల, ప్రేక్షకులకు సాధ్యమైనంత ఉత్తమమైన థియేట్రికల్ సౌండ్, విజువల్ అనుభవాన్ని అందించాలనే ఉద్దేశంతోనే 'హత:' విడుదల తేదీని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాం. ఈ సినిమాకు సంబంధించిన కొత్త విడుదల తేదీని త్వరలోనే అఫీషియల్‌గా ప్రకటిస్తాం. మా చిత్రానికి మీరు అందిస్తున్న మద్దతుకు, ప్రేమకు ఎప్పటికీ కృతజ్ఞులం" అంటూ ఆ నోట్‌లో రాసుకొచ్చారు. కాగా.. పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్, కేఏ ప్రొడక్షన్ బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అనుష్ గోరక్ దర్శకత్వం వహించారు. ఇక ఇందులో కుష్ణ మద్దాల, రెహ్మాన్, నమ్రిత తనూజ పుట్టస్వామి కీలక పాత్రలో కనిపించబోతున్నారు. 'హత:' వాయిదా పడటంతో ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రియులు కిరణ్ అబ్బవరం అభిమానులు షాక్‌కు గురవుతున్నారు.





'బైసన్ నాయుడు' ఫస్ట్ సింగిల్

అదిరిపోయే బిగ్ అప్‌డేట్‌ను విడుదల చేసి నిరాశలో ఉన్న ఫ్యాన్స్‌లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ప్రారంభించిన చిత్రబృందం, ఇందులోంచి ఫస్ట్ సింగిల్‌ను నవంబర్ 6న విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

'మదరాసిరబ్బరు బొమ్మ' అని సాగే ఈ పాట ఒక అదిరిపోయే మాస్ జానపద బీట్‌గా రాబోతోందని, యాక్షన్ డ్రామా మొదలవ్వకముందే సోషల్ మీడియాను పూర్తిగా షేక్ చేయడం ఖాయమని చిత్రయూనిట్ ఫైరింగ్ ఎమోజీలతో స్పష్టం చేసింది. ఇక ఈ మాస్ సాంగ్‌లో సాయి శ్రీనివాస్ సరసన హాట్ బ్యూటీ నేహా శెట్టి కిరాక్ స్టెప్పులేస్తూ అలరించనుంది. '14 రీల్స్ ప్లస్' బ్యానర్‌పై రామ్ అచంట, గోపీ అచంట అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. చాలా కాలం తర్వాత సాయి శ్రీనివాస్ నుంచి వస్తున్న ఈ పవర్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

'ఓం'కు సితార సపోర్ట్

ఎవరూ ఊహించని ఓ క్రేజీ మల్టీస్టారర్ బాక్సాఫీస్ బద్దలు కొట్టేందుకు సిద్ధమైంది. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, వర్సటైల్ యాక్టర్ ధనుష్, న్యాచురల్ బ్యూటీ సాయి పల్లవి, డ్యాన్సింగ్ సెన్సేషన్ శ్రీలీల.. ఇలాంటి ఉద్దండులంతా ఒకే సినిమాలో కనిపిస్తే ఆ కిక్కే వేరు.. ఇప్పుడు ఆ అద్భుతమే జరగబోతోంది. రాజ్‌కుమార్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ అండ్ ప్రెస్టీజియస్ మూవీ ఓం టాలీవుడ్ ప్రేక్షకులను అలరించడానికి ముస్తాబైంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను అత్యంత భారీ ఎత్తున విడుదల చేయడానికి ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ రంగంలోకి దిగింది. సితార సంస్థ.. ఈ పాన్ ఇండియా ప్రాజెక్టును నవంబర్ 20న ఏపీ, తెలంగాణల్లో గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురాబోతోంది.

సాధారణంగా ఒక సినిమాలో ఇద్దరు పెద్ద స్టార్లు ఉంటేనే అంచనాలు ఆకాశాన్ని తాకుతాయి. అలాంటిది ఒకవైపు మమ్ముట్టి, ధనుష్.. మరోవైపు బాలీవుడ్ లెజెండరీ నటుడు నసీరుద్దీన్ షా ఈ సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకోవడం ఒక ఎత్తు అయితే, క్రేజీ హీరోయిన్స్ సాయి పల్లవి, శ్రీలీల కలిసి నటించడం మరో ఎత్తు. ఏకకాలంలో ఇంతమంది అగ్ర నటీనటులు కలిసి నటిస్తుండటంతో ఈ సినిమా స్టోరీ ఎలా ఉండబోతోందన్న క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో విపరీతంగా పెరిగిపోయింది. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించి తెలుగు ప్రమోషన్స్‌ను సితార సంస్థ అప్పుడే వేగవంతం చేసింది. మరి ఇంతమంది స్టార్లతో వస్తున్న ఈ కట్ట మల్టీస్టారర్ తుఫాన్.. నవంబర్ 20న టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి వసూళ్ల సునామీని సృష్టిస్తుందో చూడాలి!



ఒకే శరీరంలో ఇద్దరు మనుషులు!

టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న రాకేష్ వర్రె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాయ లేడీ'. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఒకే శరీరంలో ఇద్దరు మనుషులు ఉంటే ఎలా ఉంటుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఫుల్ టైం కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమా ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రాకేష్ వర్రె మరియు మధుమితల నటన, విజువల్స్ మరియు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. నవంబర్ 13న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్ ఇష్టపడేవారికి మంచి విజువల్ ట్రీట్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

